# పూర్తిగా జీవించని జీవితం



## దాజీ

2026, ఏప్రిల్ 29, 30, మే 1వ తేదీల్లో,

కాన్హా శాంతి వనంలో

**పూజ్యశ్రీ బాబూజీ మహరాజ్**

127వ జయంతి వేడుకల సందర్భంగా ఇచ్చిన సందేశం



# పూర్తిగా జీవించని జీవితం

## భయం విడిచిపెట్టినదాన్ని విశ్వాసం ఎలా ముందుకు తీసుకెళ్తుంది

ప్రియ మిత్రులారా,

బసంత్, 2026 సమయంలో విడుదలైన భండారా సందేశాల శ్రేణిలో, మన పరిణామాన్ని అడ్డగించే ఆరు అడ్డంకులను అన్వేషించాము: కోరిక, ఆకాంక్ష అనేవి హృదయాన్ని వ్యతిరేక దిశల్లో లాగితే ఏమి జరుగుతుందో; శక్తి తన కదలికకు గల కారణాన్ని కోల్పోయినప్పుడు ఏమి జరుగుతుందో; మనకు అనుభవం కలిగినా దాన్ని విశ్వసించనప్పుడు ఏమి జరుగుతుందో; ఏదైనా సాధించబడిన స్థితి, అస్తిత్వ గుర్తింపుగా స్థిరపడినప్పుడు ఏమి జరుగుతుందో; మన స్వంత జీవితం కాకుండా వేరొకరి జీవితం వైపు దృష్టి మళ్లినప్పుడు ఏమి జరుగుతుందో; మనస్సు తన వారసత్వపు అభిప్రాయాల చట్రంలో చిక్కుకొని, రంగుటద్దంలో చూస్తూ దాన్ని తన స్పష్టమైన దృష్టిగా పొరపాటుపడినప్పుడు ఏమి జరుగుతుందో చూశాము.

ఇప్పుడు మనం మిగిలిన వాటన్నింటి లోపల దాగి ఉన్న, వీటన్నింటికంటే లోతైన అడ్డంకి వద్దకు వచ్చాం.

ఒక వ్యక్తి తన జీవితమంతా ఒకే ద్వారానికి కాపలాగా గడపడం గురించిన ఒక పాత కథ ఒకటి ఉంది. అతను ఒక చిన్న కుర్రవాడిగా ఉన్నప్పుడు, ఆ తలుపు వెనుక అతనికి కావలసిన ప్రతిదీ ఉందని, అలాగే అతన్ని నాశనం చేయగల ప్రతిదీ కూడా ఉందని అతనికి చెప్పబడింది. కాబట్టి అతను ఆ తలుపుకు తాళం

వేసి, సంవత్సరాల తరబడి దాన్ని కాపలా కాస్తూ ఉండిపోయాడు. అక్కడే నిలబడి అలాగే అతను వృద్ధుడైపోయాడు, చివరకు మరణం సమీపించినప్పుడు, తన పక్కనున్న దేవదూతను ఇలా అడిగాడు, “ఆ తలుపు వెనుక నిజంగానే విధ్వంసం ఉందా? అది నిజమేనా?” అప్పుడు దేవదూత ఆ తలుపు తీశాడు. ఆ గది ఖాళీగా ఉంది. అది ఎప్పుడూ ఖాళీగానే ఉంది.

భయం మనల్ని ఎల్లప్పుడూ నిజమైన ప్రమాదాల నుండి రక్షించదు. ఇది మనం ఊహించుకునే వాటి నుండి కూడా మనలను రక్షిస్తుంది. అలా చేయడం ద్వారా, మన జీవితం మనకోసం ఎక్కడైతే వేచిఉందో ఆ గదిలోకి ప్రవేశించకుండా అది మనల్ని నిరోధిస్తుంది.

## అన్నింటిలోనూ ప్రవహించే అంతఃసూత్రం

ఈ క్రింది ప్రకటన మనం ఇప్పటివరకు అన్వేషించిన ప్రతిదాన్నీ పునఃపరిశీలింపజేస్తుంది: భయం అనేది ఏడవ విషం కాదు, మొట్టమొదటిది అదే. రకరకాల వేషాలు వేస్తూ, రకరకాల పేర్లతో వ్యవహరిస్తూ, మొదటి నుండీ అది అక్కడే ఉంది.

మనం మరోసారి విభజించబడిన హృదయాన్ని గమనిద్దాం. ఉన్నత తోడేలు పోషించదగినదని స్పష్టంగా తెలిసినప్పటికీ, అన్వేషకుడు ఇంకా ఎందుకు నిమ్న తోడేలును పోషిస్తూ ఉంటాడు? ఎందుకంటే ఉన్నత తోడేలును ఎంచుకోవడం అంటే తనకు అలవాటైన దానిని వదులుకొని ఫలితం ఎలాగుంటుందో తెలియని కొత్త ప్రదేశంలోకి అడుగు పెట్టడంలాంటిది. విభజించబడిన హృదయం నిజానికి కోరిక వల్ల విభజించబడలేదు, అది జరిగింది భయం వల్ల; ఒక వైపును ఎంచుకుంటే ఏమవుతుందో, ఏది కోల్పోవాల్సి వస్తుందో అనే భయం; ఒక్కసారి వంతెన దాటితే, మళ్ళీ వెనక్కి రాలేమేమోనన్న భయం.



**భయం అనేది ఏడవ విషం కాదు, మొట్టమొదటిది అదే. రకరకాల వేషాలు వేస్తూ, రకరకాల పేర్లతో వ్యవహరిస్తూ, మొదటి నుండీ అది అక్కడే ఉంది.**

మనం మరోసారి నిద్రాణంగా ఉన్న జ్వాలను (లక్ష్యాన్ని మేల్కొల్పడంలో) చూద్దాం. అన్ని నైపుణ్యాలు, అన్ని అవకాశాలు, అన్ని ప్రణాళికలు ఉన్న ఒక స్త్రీ, ఏమీ చేయకుండా పడకపై అలాగే ఎందుకు ఉండిపోయింది? “నా లోపల ఉన్నదేదో నన్ను కదలనివ్వడం లేదు” అని ఆమె అంటుంది. మనం దీనిని సోమరితనం లేదా ‘తమస్సు’ అన్నాము. కానీ ఆ జ్వాలను ఆర్పేసింది ఏమిటి? అది భయం; బాధ్యత పట్ల భయం, మీరు నిజంగా మేల్కొన్నప్పుడు ఏమి జరుగుతుందో అనే భయం, మీరు ప్రయత్నించి విజయం సాధిస్తే ఆ విజయాన్ని నిలబెట్టుకుంటూనే ఉండాలనే భయం, ఒకవేళ మీరు ప్రయత్నించి విఫలమైతే ఆ వైఫల్యం మీ గురించి మీకుండే నిగూఢ అనుమానాలను నిజం చేస్తుందనే భయం. నిద్రాణమైన ఆ జ్వాల తనంతటతాను ఆరిపోలేదు. భయం దానిని ఊపిరాడకుండా చేసి ఆర్పేసింది, ఆపై ఆ బూడిదపై నిలబడి దానినే సోమరితనం అని పిలుస్తున్నది.

మనం బీటలు వారిన పునాదిని (బలమైన పునాదిని నిర్మించడంలో) మరోసారి గమనిద్దాం. పదకొండు ఏళ్లుగా ధ్యానం చేస్తూ, చుట్టూ ఉన్న వారందరికీ స్పష్టంగా కనిపించేలా మార్పు చెందిన ఆ మహిళ, ఇంకా “ఇది నిజమేనా? అసలు నిజంగా ఏదైనా మారిందా?” అని ఎందుకు అడుగుతోంది? ఎందుకంటే తనలోని పరివర్తనను తాను నమ్మడం అంటే, అది ఎక్కడ చేజారిపోతుందో అనే అభద్రతా భావానికి లోనవ్వడమే. సందేహం అనేది ప్రజ్ఞ కాదు; అది గతం తాలూకు భయం, తనకు ఇవ్వబడినది మళ్ళీ వెనక్కి తీసుకోబడుతుందేమోననే భయం, మీ పాదాల క్రింద ఉన్న భూమి మీరు అనుకున్నంత గట్టిది కాదేమోననే భయం. మనం దీనిని సందేహం అని అన్నాం, కానీ దాని అసలు పేరు భయం, సందేహమనే ల్యాబ్ కోటు ధరించిన భయం.



సందేహం అనేది ప్రజ్ఞ కాదు; అది గతం తాలూకు భయం, తనకు ఇవ్వబడినది మళ్ళీ వెనక్కి తీసుకోబడుతుందేమోననే భయం, మీ పాదాల క్రింద ఉన్న భూమి మీరు అనుకున్నంత గట్టిది కాదేమోననే భయం. మనం దీనిని సందేహం అని అన్నాం, కానీ దాని అసలు పేరు భయం, సందేహమనే ల్యాబ్ కోటు ధరించిన భయం.

మనం మరోసారి అహం సృష్టించిన పైకప్పును చూద్దాం. అహం తాను నిర్మించుకున్న హరిత గృహపు ఆవరణను దాటి వెళ్ళడానికి ఎందుకు నిరాకరిస్తుంది? ఎందుకంటే బయట ఉన్న ఆకాశానికి గోడలు లేవు. ఆ హరిత గృహం వెలుపల అసలైన వాతావరణం, అసలైన గాలి, అసలైన తుఫానులు, ఊహించని అసలైన పరిణామాలు ఉంటాయి. అహం యొక్క ఆవరణ అనేది నిజానికి గర్వం గురించి కాదు, అది సంరక్షణ గురించి. ఆ గాజుగోడను పగులగొట్టినప్పుడు, మీరు అన్నింటికీ బహిర్గతం అవుతారు. అహంకారం అనేది బహిర్గతం అవుతామనే భయం, అహమనేది విజయం అనే వస్త్రధారణ చేసికొన్న భయమే.

మరోసారి అరువు తెచ్చుకున్న గాయం వైపు మనం దృష్టి సారిద్దాం. అసూయతో నిండిన హృదయం తన స్వంత జీవితాన్ని జీవించకుండా, ప్రక్కలకు మరొకరి జీవితం వైపు ఎందుకు చూస్తుంది? ఎందుకంటే మీ స్వంత జీవితాన్ని జీవించడం అంటే, మీకు ఇవ్వబడినది సరిపోతుందా లేదా, మీకు మీరు స్వయంగా సరిపోతారా లేదా అనే ఒక భయానక ప్రశ్నను ఎదుర్కోవడమే. అసూయ అనేది నిజానికి వేరొకరి ప్రతిభ గురించి కాదు, అది మీ స్వంత ప్రతిభ సరిపోదేమోననే భయాన్ని గురించి. అసూయ అనేది పోలిక అనే ముసుగులో దాక్కున్న భయం.

మనం చూడజాలని గోడలకావలను మళ్ళీ చూద్దాం: ఎందుకు మనస్సు వారసత్వంగా వచ్చిన అభిప్రాయాల వెనుక బంధించబడి, తాజా కాంతి ప్రవాహాన్ని నిరాకరిస్తుంది? ఎందుకంటే పారదర్శకత అనేది భయానకమైనది. ప్రపంచం గురించిన మన దృక్పథం పాక్షికంగా ఉండవచ్చని అంగీకరించడం అంటే మనం నిలబడి ఉన్న నేల, మొత్తం నేల కాకపోవచ్చునని అంగీకరించడమే.



మనం కిటికీ తెరిచి, మనకు పేరు తెలియని రంగుని లోపలకి రానిస్తే, మనం ఏ గుర్తింపు మీదయితే ప్రతిదాన్నీ నిర్మించుకున్నామో దాన్ని పునరాలోచించవలసి వస్తుందనే భయం గురించి. పూర్వాభిప్రాయం అంటే కచ్చితత్వం అనే ముసుగులో ఉన్న భయం.

పూర్వాభిప్రాయం అనేది నిజంగా ఇతరులు లేదా ఇతర మతం, ఇతర సమాజం లేదా ఇతర మార్గాల గురించి కాదు. మనం కిటికీ తెరిచి, మనకు పేరు తెలియని రంగుని లోపలకి రానిస్తే, మనం ఏ గుర్తింపు మీదయితే ప్రతిదాన్నీ నిర్మించుకున్నామో దాన్ని పునరాలోచించవలసి వస్తుందనే భయం గురించి. పూర్వాభిప్రాయం అంటే కచ్చితత్వం అనే ముసుగులో ఉన్న భయం.

ఈ ఏడు విషాల మూలంలో ఉన్నది ఒకే వ్యాకులత, ఒకే కంపన.

## స్తంభనా స్థితి యొక్క నిర్మాణం

భయం అనేది అతిశయోక్తి ద్వారా పనిచేస్తుంది. ఇది జరగబోయే ఒక చిన్న ఫలితాన్ని తీసుకుని, మొత్తం దిగంతాన్ని ఆక్రమించేంతగా దానిని పెంచుతుంది. భయం చేతిలో, “నేను విఫలమైతే ఎలా?” అనేది ఒక నిశ్చయమైన విపత్తుగా మారుతుంది; “వారు నన్ను తిరస్కరిస్తే ఎలా?” అనేది నిస్సందేహమైన సత్యంగా మారుతుంది; “నా సామర్థ్యం సరిపోకపోతే ఎలా?” అనేది ఇంకా సంపూర్ణంగా జీవించని ఒక జీవితంపై వెలువడే అంతిమ తీర్పుగా మారుతుంది.

కఠోపనిషత్తులో మృత్యుదేవత అయిన, యమధర్మరాజు నివాసానికి, అత్యున్నత సత్యాన్ని కోరుతూ, స్వచ్ఛందంగా వెళ్ళిన బాల నచికేతుని కథ ఉంది. అతని తండ్రి ఒక పవిత్ర యాగాన్ని చేస్తూ, పనికిరాని పాత వస్తువులను దానమిచ్చి ఉత్తమమైన వాటిని తన వద్దే ఉంచుకుంటాడు. దానిలోని డొల్లతనాన్ని గమనించిన ఆ బాలుడు, “నన్ను ఎవరికి దానం ఇస్తావు?” అని తన తండ్రిని ముమ్మారు అడుగుతాడు. ఆ తండ్రి క్షణికావేశంలో, “నిన్ను మృత్యువుకు ఇచ్చేస్తాను” అని అంటాడు.

అలా ఆ బాలుడు వెళ్తాడు. పెద్దవాళ్ళందరూ దేనినైతే చూసి భయపడతారో, ఆ మృత్యువు దిశగా ఒక చిన్న పిల్లవాడు వెళ్ళాడు. అది అతను నిర్లక్ష్యంగా చేసిన పని కాదు, నశించిపోతాననే భయం కంటే, సత్యం పట్ల అతనికున్న తపన చాలా గొప్పది కాబట్టే అలా వెళ్ళాడు. నచికేతుడు అక్కడికి చేరుకున్నప్పుడు మృత్యుదేవత అయిన యముడు అక్కడ ఉండడు. ఆ బాలుడు మృత్యువు

ద్వారం వద్ద మూడు పగళ్లు, మూడు రాత్రులు కూడు, గూడు, ఓదార్చే తోడు ఎవరూ లేకుండా, అలా వేచి ఉంటాడు. యముడు తిరిగి వచ్చినప్పుడు, ఆ బాలుని ధైర్యానికి ముగ్ధుడై మూడు వరాలు కోరుకొమ్మని అంటాడు.

అతను కోరుకున్న మొదటి వరం: తన తండ్రి కోపం చల్లారాలి. రెండవది: స్వర్గానికి దారితీసే అగ్ని క్రతువును బోధించాలి. ఈ రెండూ వెంటనే మంజూరు చేయబడ్డాయి. కానీ మూడవ వరం మృత్యువును సైతం వణికించింది: “మనిషి మరణానంతరం ఏం జరుగుతుందో నాకు చెప్పండి. ఆత్మ ఉనికిలో అలాగే ఉంటుందా? నాకు సత్యాన్ని  చెప్పండి” అని అడిగాడు.

భయం వల్ల అంగీకరించగలిగే ప్రతిదాన్ని ఇచ్చి యముడు, నచికేతుని ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తాడు. సంపదలు, రాజ్యాలు, దీర్ఘాయువు, సౌందర్య కాంతలు, ఊహకు అందని సుఖాలు, ఇలా సామాన్యంగా ప్రపంచం కోరుకునే ప్రతీ బహుమతిని యమధర్మరాజు ఆ బాలుని పాదాల వద్ద ఉంచుతాడు. నచికేతుడు వాటినన్నింటినీ నిరాకరించి, “ఇవన్నీ అంతమైపోయేవే” అని అంటూ “మీరు మృత్యువుకు అధిపతి. దీన్ని గురించి అందరికన్నా మీకే బాగా తెలుసు. ఏది అంతమవదో దాన్ని గురించి నాకు చెప్పండి” అని అడుగుతాడు.

ఇదే విశ్వాసం యొక్క అత్యంత స్వచ్ఛమైన రూపం: ఆత్మ ఉత్కృష్టమైన ప్రశ్నను అడుగుతున్నప్పుడు, దానికి అల్పమైన సమాధానాన్ని అంగీకరించేందుకు నిరాకరించడం. ఇది నిర్భయత్వం కాదు; ఇది ఒక తపన; ఆ తపన ఎంత ఉన్నతంగా మారిందంటే, దానితో పోలిస్తే భయం చాలా చిన్నదిగా కనిపిస్తుంది.



**ఇదే విశ్వాసం యొక్క అత్యంత స్వచ్ఛమైన రూపం: ఆత్మ ఉత్కృష్టమైన ప్రశ్నను అడుగుతున్నప్పుడు, దానికి అల్పమైన సమాధానాన్ని అంగీకరించేందుకు నిరాకరించడం. ఇది నిర్భయత్వం కాదు; ఇది ఒక తపన; ఆ తపన ఎంత ఉన్నతంగా మారిందంటే, దానితో పోలిస్తే భయం చాలా చిన్నదిగా కనిపిస్తుంది.**

చారీజీ ఒకసారి ఈ కథను గుర్తుచేసి, నేర్చుకోవాలనే తపన ఉన్నవారికి మరణమే గొప్ప గురువు అని వివరించారు. నచికేతుడు మృత్యువు పట్ల తనకున్న భయాన్ని జయించలేదు. అతను కేవలం తన భద్రత కంటే సత్యాన్నే ఎక్కువగా కోరుకున్నాడు. కాపలా కాయబడుతున్న ఆ తలుపును తెరిచే తాళంచెవి ఇదే: తొలగించడం ద్వారా భయం జయించబడదు, భయాన్ని అసంబద్ధమైనదిగా చేసే గుణాన్ని పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది. తన బిడ్డను రక్షించడానికి మండుతున్న భవనంలోకి దూసుకెళ్లే తల్లి, అగ్ని పట్ల తనకున్న భయాన్ని జయించాలని ఆగి ఆలోచించదు. ఆమె ప్రేమ ఆ భయం కంటే చాలా విశాలమైనది. అక్కడ అగ్ని మారలేదు, ఆమె మారింది.

## జీవించబడని సంస్కారాలు

ప్రయత్నించి విఫలమైన కలల కంటే, కనీసం ప్రయత్నం కూడా చేయకుండానే నశించిపోయిన కలలు, ఆ కలగన్నవారిని మరింతగా వేధిస్తాయి. సంప్రదాయం ఎల్లప్పుడూ బోధించే జ్ఞానం ఇదే: విఫలమైన సంస్కారాల కంటే, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులవల్ల కలిగే సంస్కారాలు మరింత లోతుగా నాటుకుంటాయి. ఒక పని పూర్తైనప్పుడు, చివరకది దుఃఖంతో ముగిసినప్పటికీ, దానిలో ఒక సమగ్రత ఉంటుంది, అది శాంతిని తీసుకొస్తుంది. కానీ వదిలివేయబడిన కలలో అటువంటి సమగ్రత అనేది ఉండదు. అది పరిష్కారం కాకుండా, భయం కారణంగా మనం సమాధానం ఇవ్వలేని ప్రశ్నగా మిగిలి, మన చైతన్యంలో నిరంతరం సజీవంగా ఉంటుంది.

సాయంత్రం చేసుకునే హార్ట్‌ఫుల్‌నెస్ నిర్మలీకరణ పద్ధతిలో, మనం కూర్చుని ఆ రోజంతా ఏర్పడిన ముద్రలు వెనుక నుండి తొలగిపోయేలా చేస్తాము. మనం చేసినవాటిని, మాట్లాడినవాటిని, అనుభవించినవాటిని వదిలివేస్తాము. కానీ అరుదుగా చర్చించబడే ఒక విషయాన్ని పరిశీలిద్దాం: మనం చేయని పనులు, మనం వదిలి తప్పించుకున్న సంభాషణ, మనం చెప్పని నిజం, మనం వేయని అడుగు, మనం వ్యక్తం చేయని ప్రేమ కూడా ముద్రలను సృష్టిస్తాయి. చర్యల ద్వారా ఏర్పడిన ముద్రల కంటే ఈ ముద్రలను నిర్మూలించడం కష్టం కావచ్చు,

ఎందుకంటే ఇవి జరిగిన సంఘటనలు కావు. అవి జరగనివి. అవి నీడల వంటివి. మరి నీడను మీరెలా తుడిచివేయగలరు?

భయం ఏదైనా పనిని అడ్డుకున్న ప్రతిసారీ, జరగని ఆ పని అసంపూర్ణమైన ఒక సంస్కారాన్ని నిక్షిప్తం చేస్తుంది. నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు గడిచేకొద్దీ ఈ నిక్షేపాలు పేరుకుపోయి, ఒక రకమైన భారాన్ని కలిగిస్తాయి. అవి 'తమస్సు'ను సృష్టిస్తాయి. చూడ్డానికది బద్ధకంలా అనిపిస్తుంది కానీ నిజానికి అదొక వేదన. జీవించే అవకాశం ఉండి కూడా, జీవించలేకపోయిన జీవితం పట్ల కలిగే వేదన.

భయం వల్ల మీరు ఏదైనా ఒక పని చేయకుండా తప్పించుకున్న ప్రతిసారీ, ఆ తప్పించుకోవడం అనేది ఇంకొంచెం సులభం అవుతుంది, మీ ధైర్యం కొంత బలహీనపడుతుంది. వేయని ప్రతి అడుగుతో, జీవించని జీవితపు భారం పెరుగుతుంది, ఆ భారమే చివరకు తర్వాతి అడుగు వేయడం అసాధ్యమనేలా చేస్తుంది. అది మీరు కదలలేకపోవడం వల్ల కాదు. మీరు చాలాకాలం ఒకేచోట నిలబడి ఉండటం వల్ల, నేల మీ పాదాల చుట్టూ పెరిగినట్లు అనిపిస్తుంది.

## మనల్ని నడిపించేది ఏమిటి?

ఆధ్యాత్మిక కోణంలో విశ్వాసం అంటే నిదర్శనంలేని నమ్మకం కాదు. అది అనుభవం నుండి పుట్టిన నమ్మకం. ధ్యానంలో కూర్చుని తనకంటే ఉన్నతమైన అస్తిత్వాన్ని స్పష్టంగా అనుభూతి చెందిన వ్యక్తి, భయం వివరించలేని ఒక అనుభవాన్ని పొందుతాడు. ప్రతిరోజు నిరంతరాయంగా, సంవత్సరాల తరబడి



**భయం ఏదైనా పనిని అడ్డుకున్న ప్రతిసారీ, జరగని ఆ పని అసంపూర్ణమైన ఒక సంస్కారాన్ని నిక్షిప్తం చేస్తుంది. నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు గడిచేకొద్దీ ఈ నిక్షేపాలు పేరుకుపోయి, ఒక రకమైన భారాన్ని కలిగిస్తాయి. అవి 'తమస్సు'ను సృష్టిస్తాయి. చూడ్డానికది బద్ధకంలా అనిపిస్తుంది కానీ నిజానికి అదొక వేదన. జీవించే అవకాశం ఉండి కూడా, జీవించలేకపోయిన జీవితం పట్ల కలిగే వేదన.**



**ఆధ్యాత్మిక కోణంలో విశ్వాసం అంటే నిదర్శనంలేని నమ్మకం కాదు. అది అనుభవం నుండి పుట్టిన నమ్మకం. ధ్యానంలో కూర్చుని తనకంటే ఉన్నతమైన  అస్తిత్వాన్ని స్పష్టంగా అనుభూతి చెందిన వ్యక్తి, భయం వివరించలేని ఒక అనుభవాన్ని పొందుతాడు.**

పునరావృతమయ్యే ఈ అనుభవం, ఒక పునాదిని సాధకుని పాదాల క్రింద నిర్మిస్తుంది. ఆ పునాదిని భయం చెరిపివేయలేదు.

హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతిలోని ప్రాణాహుతి, భయం సృష్టించే ఉచ్చును విచ్ఛిన్నం చేస్తుంది. హృదయంలోకి ప్రాణాహుతి ప్రవహించినప్పుడు, అది 'భయం'తో వాదులాడదు లేదా దానికి వ్యతిరేక నిదర్శనాలను చూపదు. భయం తన అధికారాన్ని కోల్పోయే విధంగా, అది కేవలం ఆ శూన్యాన్ని, అనుభూతిచెందగలిగే ఒక వాస్తవికతతో నింపుతుంది. ఎవరైనా దీపాన్ని వెలిగించినప్పుడు, చీకటిని చూసి మీరు భయపడరు కదా! ఇక్కడ చీకటి జయించబడలేదు, దాని ప్రాముఖ్యత తీసివేయబడింది.

ఇక్కడ మార్గదర్శకుని పాత్ర కూడా ఉంది. తల్లిదండ్రుల చేయి పట్టుకున్న పిల్లవాడు, ఒంటరిగా వెళ్ళేందుకు భయపడే గదిలోకి కూడా ధైర్యంగా వెళ్తాడు. గది మారినందువల్ల కాదు. ఆ చేయి ఇచ్చే భరోసా వల్ల, ఆ గదిలో ఏమున్నా ఎదుర్కోగలననే ధైర్యం ఆ బిడ్డకు వస్తుంది. ఆధ్యాత్మిక  మార్గదర్శి అత్యంత లోతైన స్థాయిలో ఇదే పని చేస్తారు: ఈ మార్గంలో ఒకరు నడిచారనే సజీవమైన భరోసాను ఇస్తూ, ఆ మూసిన తలుపు వెనుక ఉన్న గది ఖాళీగా లేదని, అది ప్రమాదకరం కాదని, మీరు వెతుకుతున్న దానితోనే అది నిండి ఉందని, మీకు అవసరమైనంత కాలం ఈ చేయి మీకు తోడుగా ఉంటుందని ఆయన ధైర్యానిస్తారు.

బాబూజీ ఒకసారి మానవాళి గురించి చాలా సున్నితంగా, మనం చర్చించిన ప్రతి విషయాన్ని ఒక కొత్త కోణంలో వివరించారు. మానవులందరూ భరోసా అవసరమైన పిల్లలవంటివారని, వాళ్ళకు తెలిసినా తెలియకపోయినా



**ఆధ్యాత్మిక మార్గదర్శి అత్యంత లోతైన స్థాయిలో ఇదే పని చేస్తారు: ఈ మార్గంలో ఒకరు నడిచారనే సజీవమైన భరోసాను ఇస్తూ, ఆ మూసిన తలుపు వెనుక ఉన్న గది ఖాళీగా లేదని, అది ప్రమాదకరం కాదని, మీరు వెతుకుతున్న దానితోనే అది నిండి ఉందని, మీకు అవసరమైనంత కాలం ఈ చేయి మీకు తోడుగా ఉంటుందని ఆయన ధైర్యానిస్తారు.**

వాళ్ళందరిలో యుగయుగాల నుండి వస్తున్న ఒక లోతైన భయం దాగి ఉంటుందని ఆయన అన్నారు. తమ నిజమైన స్వగృహానికి దూరంగా ఉండటం వల్ల వాళ్ళు ఒకరకమైన శూన్యతను అనుభవిస్తారని, ఎప్పుడో ఒకప్పుడు దాన్ని భర్తీ చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

దయచేసి పై పేరాను మళ్ళీ చదవండి. బాబూజీ దృష్టిలో భయం అనేది ఒక వ్యక్తిత్వ లోపమూ కాదు లేదా సిగ్గుపడవలసిన ఒక బలహీనతా కాదు. అది తన మూలానికి దూరంగా తిరుగుతున్న ఆత్మ యొక్క అస్తిత్వానికి సంబంధించిన స్థితి. మీరు అనుభవిస్తున్న భయం అనేది పిరికితనం కాదు, అది స్వగృహం మీద మీకున్న బెంగ. ఆ మూసి ఉన్న తలుపు వెనుక మీరు కాపాడుతున్న కల కేవలం కాల్పనికమైనది కాదు; మీరు ఎక్కడి నుండి వచ్చారో గుర్తుచేస్తూ, మిమ్మల్ని మీ ఇంటికి రమ్మని పిలుస్తున్న ఒక జ్ఞాపకం అది.

## నశించేందుకు నిరాకరించే కల

భయం మీకు తెలియకూడదని కోరుకునే విషయం ఏమైఉంటుంది? తాను నశింపజేశాను అని అది అనుకున్న ఆ స్వప్నం, ఇంకా సజీవంగానే ఉంది. మీరు వివరించలేని అశాంతిలో, బాహ్య సౌకర్యాలు ఉన్నప్పటికీ మిమ్మల్ని వీడని అసంతృప్తిలో, రక్షణ వ్యవస్థలన్నీ క్షీణదశకు చేరుకున్నప్పుడు, అనుమతి లేకుండానే ఉదయం మూడు గంటలప్పుడు హృదయం మాట్లాడేటపుడు వచ్చే ఆ అపూర్వమైన ఉద్దీపనలో, అది సజీవంగానే ఉంది. అదే ఆ స్వప్నం, తనను బయటకు రానివ్వమని లోపలి నుండి తలుపు తడుతోంది.

భయం, అత్యంత అసూయతో కాపాడుకునే రహస్యం ఏమిటి? మీరు మొత్తం దూరాన్ని జయించాల్సిన అవసరం లేదు, మీరు కేవలం మొదటి అడుగు వేస్తే చాలు. దూరం అనంతమని భయం అంటుంది; కేవలం ఈ ఒక్క అడుగు, కేవలం ఈ ఒక్క శ్వాస, కేవలం ఈ ఉదయపు ధ్యానం, అని విశ్వాసం అంటుంది.



ప్రతీ ఆధ్యాత్మిక సంప్రదాయం ఇదే కథను చెబుతుంది: భయం మిమ్మల్ని అనుమతించే దానికంటే మీరు ఎంతో ఉన్నతమైన దానికోసం సృష్టించబడ్డారు. ఆత్మ యొక్క సామర్థ్యం అనంతమైనది. ఆ పంజరం మీరు స్వయంగా నిర్మించుకున్నదే; మీ జీవితాంతం మీరు కాపలా కాస్తున్న ఆ తలుపు బయట నుండి ఎప్పుడూ తాళం వేయబడిలేదు, అది లోపలి నుండి తాళం వేయబడి ఉంది.

## సంపూర్ణ వృత్తం

మనం ఈ సందేశాల శ్రేణిని ఫిబ్రవరిలో, తాను కోరుతున్న దానికీ, సరైనదని తనకు తెలిసిన దానికీ మధ్య విభజించబడిన హృదయంతో ప్రారంభించాము. తన లక్ష్యాన్ని మరచిన జ్వాల ద్వారా, తనను తాను నమ్మలేని పునాది ద్వారా, ఆకాశాన్ని అందుకోవలసిన విజయాలే పైకప్పుగా మారిన స్థితి ద్వారా, వేరొకరి జీవితం నుండి అరువు తెచ్చుకున్న గాయాన్ని మనదిగా భావించడం ద్వారా, రంగుటద్దాల గోడలకు రంగులున్నాయనే విషయాన్ని మనం మరిచిపోవడం ద్వారా మనం ప్రయాణించాము.

ఇప్పుడు, వీటన్నింటినీ కలిపే ఆ అంతఃసూత్రాన్ని మనం కనుగొన్నాం: అది భయం. ఎంచుకోవడానికి భయపడతాం కాబట్టి కోరిక మనల్ని విభజిస్తుంది.



**దూరం అనంతమని భయం అంటుంది; కేవలం ఈ ఒక్క అడుగు, కేవలం ఈ ఒక్క శ్వాస, కేవలం ఈ ఉదయపు ధ్యానం, అని విశ్వాసం అంటుంది.**

మేల్కొనడానికి భయపడతాం కాబట్టి జడత్వం మనల్ని నిలిపివేస్తుంది. నమ్మడానికి భయపడతాం కాబట్టి సందేహం మనల్ని క్షీణింపజేస్తుంది. తెరచిఉన్న ఆకాశమంటే భయం వల్ల, గర్వం మనల్ని బంధిస్తుంది. మన స్వంత అపరిపూర్ణత పట్ల ఉన్న భయం వల్ల అసూయ మనల్ని బలహీనపరుస్తుంది. నిర్మలమైన కాంతి దేనిని బహిరంగపరుస్తుందోనన్న భయం వల్ల  పూర్వాభిప్రాయం అనేది కిటికీలను మూసివేస్తుంది.

చివరిగా, ఈ ఆరింటికి మూలకారణమైన భయం, లోపలి నుండి తలుపుకు తాళం వేస్తుంది, ఎందుకంటే ఆ తలుపు వెనుక ఉన్నది విధ్వంసం కాదని, అదే మనం జీవించాల్సిన అసలైన జీవితమని మనం మర్చిపోయాము కాబట్టి.

ఆ తాళంచెవి ఒకే ఒక చిన్నపాటి చర్యతో తిరుగుతుంది: భయాన్నంతా ఒకేసారి జయించాలనే పెద్దచర్య అవసరం లేదు.  చేయవద్దు అని భయం నీకు చెప్పిన ఆ పనిని ఈ రోజు చేసేందుకు, నువ్వు వేసే తిరుగులేని ఒక చిన్న అడుగు చాలు. ధ్యానం వల్ల ప్రయోజనం లేదని భయం అన్నప్పుడు, ధ్యానంలో కూర్చోండి. నిజం చెప్పడం ప్రమాదకరమని భయం అన్నప్పుడు, నిజం మాట్లాడండి. ప్రేమిస్తే బాధపడతావని భయం అన్నప్పుడు, పరిపూర్ణంగా ప్రేమించండి. మీరు పడిపోతారని భయం అన్నప్పుడు, ధైర్యంగా అడుగు ముందుకు వేయండి.

హిమ్మత్ ఎ మర్దా, మదద్ ఎ ఖుదా

మీరు ధైర్యంగా ఒక అడుగు వేస్తే, మిగిలిన దూరాన్ని దైవం పూర్తి చేస్తుంది.

భయం “ఏమవుతుందో…?” అంటుంది.

విశ్వాసం “ఏమైనాకానీ…” అంటుంది, మీకోసం ఎదురు చూస్తోన్న జీవితాన్ని జీవించడానికి.

ప్రేమతో, ప్రార్థనలతో,
కమలేష్

2026, ఏప్రిల్ 29, 30, మే 1వ తేదీల్లో,  కాన్హా శాంతి వనంలో
పూజ్యశ్రీ బాబూజీ మహరాజ్ 127వ జయంతి వేడుకల సందర్భంగా ఇచ్చిన సందేశం

# *There's More Waiting For You*

to go a little deeper

## HEARTFULNESS APP

A Quiet Place to Start

Carry your practice with you — download the free app and connect with a personal trainer anytime.

Free Download. Daily practice. Trainer always Available.

Heartfulnessapp.org

## MASTERCLASSES

Go Deeper at Home

Learn with Daaji relaxation, meditation, cleaning, and prayer through three freely offered video sessions.

Free Videos. Learn from Daaji. 3 classes.

Heartfulness.org/global/masterclass

## RETREAT

Time for Just You

Step away from the noise and into a peaceful weekend that quietly deepens everything.

Peaceful Setting. Deepen Practice. Weekend Stays.

Heartfulness.org/global/retreat

## HEARTSPOTS

Find a Centre Near You

Your nearest meditation centre is closer than you think at no cost.

6000+ Centres. Heartful Community. Free to Visit.

Heartspots.heartfulness.org

Scan to download the free app, always there when you need it.
Start with a guided session, and let the practice find its own rhythm in you.
The journey inward begins with a single, still moment.

heartfulness

purity weaves destiny